శత్రువు నేర్పిన పాఠం

కోర్టు బోనులో ఒకగొల్లవాడు నిలబడి ఉన్నాడు. చెదలు దిన్న గుంటుక చెక్కలాగా అమ్మతల్లి గుంటల ముఖం- అక్కడక్కడ పెరిగినగడ్డం.... ఎడమచెవికి అరిగిపోయిన ఎఱ్ఱరాయి కొనుకపోగు- బాగామాసి చిరిగిన కుప్పునపు ధోవతి నిండా పేడ మరకలు- నల్లగా మాగిన గడుకకుండ లాంటి ఒళ్ళు.... ఇదీ అతని రూపం....ఎడం కాలు ఏదో రాయి మీది నుండి పడ్డప్పుడు కీలు తొలిగి కొంచెం వంకరయ్యి ఎగుడు దిగుడుగా ఉన్నది.... అతని బట్టలనుంచి, ఒంటినుంచి గొర్ల వాసన గుప్పు మంటోంది.... అతని పక్క ఇంకా మీసాలు సరీగా మొలవని బోడగుండు యువకుడున్నాడు. అతని కణతల మీద అర్ధ రూపాయంత బఱ్ఱలు. ఒంటిమీద బుజాలు చిరిగిన ముతక బనీనూ.... యువకుడి కుడికాలుకు మోకాలుదాకా ఏనుగు గజ్జిపుండు బాగా రెచ్చిపోయి సొనకారుతోంది. వారిపోలికలిస్తే తండ్రి కొడుకులదిలాగుంది.

ఇంతలో ఎత్తుపళ్ళ గూని లాయరొకడు నల్లగౌనువేసుకొని కొంపలుమునిగి పోయినట్టుగా ముఖం మాడ్చుకొని హడావిడిగా వచ్చాడు.... గుమ్మడి పండులాంటి జడ్జీ సుతారంగా అలవాటు ప్రకారంగా సుత్తిని బల్లమీద కొట్టి ఊబ చెంపలు కిందూమీదూ కాగా, "ఆడర్....

ఆడర్'' అన్నాడు.... జడ్జీ టేబులు ముందు కూర్చున్న కోతి ముఖపు గుమస్తా తన ముందున్న చెక్క బల్లమీది అద్దాలు కళ్ళకు తగిలించు కొని పెన్నుమూత తీశాడు.

ఎత్తుపళ్ళ లాయరు ఓమారు గాలిపంఖా వేపు, మరొకమారు కోర్టు బయటికి చూసి, ముద్దాయిలను చూడకుండానే జడ్జీవేపు కళ్ళు తిప్పి ముద్దాయిల బోను వేపు నడిచాడు.

కోర్టు గుమాస్తా లావుపాటి పుస్తకమొకటి తెచ్చాడు.

"రాళ్ళవానకూ బోడనెత్తికీ దంట-'' అన్నాడు యువకుడు.

తండ్రి తనకివేమి పట్టనట్టు జడ్జీ తల మీదుగావున్న గొప్ప వాళ్ళ బొమ్మలు చూస్తున్నాడు.... అలవాటున్న వానిలాగానే పుస్తకం మీద చేయుంచాడు.

లాయరు మంత్రం లాగా ఏదో చెప్పి చివరకు "అంతా నిజమే చెప్పుతాను'' అనమన్నాడు.

తండ్రి మామూలుగానే అనేశాడు. కొడుకు "అంతా నిజమే చెప్పుతాను''.... అన్నాడు వ్యంగ్యంగా....

జడ్జీ కల్లు పులపొడిసిండు. నల్లకోటు లాయరు అప్పుడుసూటిగా ముద్దాయిల వేపు చూస్తూ....

"నీ పేరేమిటి?''

"గొల్ల గంగులు''

"మే 24వ తారీఖున నీ యింట్లో బాంబు పేలింది నిజమేనా?''

"నిచ్ఛమే....''

"ఆ తరువాత పోలీసులొచ్చి నీయిల్లు సోదాచేస్తే మరో అయిదు

బాంబులు దొరికినయ్ నిజమేనా?''

"నిచ్చమే....''

''యువరానర్ సార్.... అంటే అంతకుముందునుంచి నీదగ్గర బాంబులున్నయన్నమాట''

"ఉన్నయి....''

''1978, అంటే రెండేండ్ల కింద నీదగ్గర బాంబులున్నయా?''

"ఆటి సంగతే నాకెర్కలే.... అయ్యేట్లుంటయో సుతదెల్వదు.''

''1978లో మీవూళ్లో రైతుకూలి సంఘం బెట్టుకున్నారు. అందులో నువ్వు మెంబరు వైనావు....''

''అయిన- గదంట్ల దొంగతనమేమున్నది? సాటుకుగాదు సంగం నేటుకే పెట్టుకున్నం.''

''శ్రీపతి లక్ష్మణ్‌రావు నీకు తెలుసా?''

''గదేం మాట- మా నెత్తురు, మాంసం మింగి కూసున్న మా వూరిదొర మాకెర్క లేదా?''

"రైతుకూలి సంఘం 1978 ఆగష్టు 14వ తేదిన శ్రీపతి లక్ష్మణ్‌రావు ఇంటి మీద దాడిచేసి ఫర్నిచర్ విరగ్గొట్టింది, అదే సంవత్సరం నవంబర్ 29 నాడు అతని గొర్లమందమీద దాడిచేసి వంద గొర్రెలు ఎత్తుకపోయింది. 1979 మార్చి 12వ తేదీన నాలుగెకురాల మొక్క జొన్న పెరడు దోపిడిచేసింది....'' ఇట్లాగా మరో పది నిముషాలు తేదీలు నెలలుచెప్పి చివరకు "ఇవన్నీ నిజమేనా?'' అన్నాడు లాయర్....

"తమరి మాటల సెప్పన్నంటె నిచ్చమే- సంఘం మాటల సెప్పన్నంటె అవద్దము....''

''అన్నిట్లో నువ్వున్నావు.... ''

"ఉన్ననే కద కేసులు బెట్టింది...."

"యువరానర్ సర్" తను సంఘ సభ్యుడయిన ముద్దాయి మొదటే ఒప్పుకున్న సంగతి గమనించాలి."

"నిచ్చమే.... నిచ్చమే... గడంత ఖాంతమినియిని సెవులు సిల్లులుబడిపోతున్నయి. మేం సంగం బెట్టుకున్నం....మావూల్లె లేనోల్లకు ఉన్నోల్లకు లడాయి షురువయ్యింది గప్పుడే..."యువకుడు అసహనంగా క్రోధంగా అన్నాడు....

"యువరానర్ సర్.... 1978 నుండి ఈ జిల్లాలో సంఘ విద్రోహుల కార్యకలాపాలు పెరిగిపోయాయి.... చాపకింది నీళ్ళలాగా గ్రామగ్రామంలో సంఘ విద్రోహులు చొచ్చుకపోయారు. పాడిపంటలతో పరమ ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో అశాంతి ప్రబలింది.... అందుగులపల్లి అనే గ్రామంలో మొదటి ముద్దాయి గొల్ల గంగులు, వరఫ్ చిన వెంకులు, రెండవ ముద్దాయి గొల్ల పర్వతాలు వరఫ్ గంగులు యిద్దరు సంఘ సభ్యులయ్యారు... సంఘం చేసిన దౌర్జన్య పూరితమైన ప్రతి చర్యలో పాల్గొన్నారు. అందుకు సాక్ష్యంగా కోర్టులో ఇంకా విచారణలో కేసులున్నాయి.... అందుగులపల్లి వాస్తవ్యుడైన శ్రీ శ్రీపతి లక్ష్మణరావుగారి పంటలు, పశువులు, భూములు దోచుకోవడమేకాక అనేకసార్లు ఇంటిమీదికి దాడి చేసి అతన్ని చంపుతామని బెదిరించారు. చంపే ప్రయత్నాలు కూడా చేశారు. శ్రీపతి లక్ష్మణరావుగారు ఈ అరాచక చర్యల్ని అటు ప్రభుత్వం దృష్టికి, యిటు కోర్టువారి దృష్టికి ఎప్పటి కప్పుడు తెస్తూనే ఉన్నారు. ప్రభుత్వంవారు కల్పించుకొని తగిన సమయంలో ఆ గ్రామంలో పోలీసు బందోబస్తు జరిపించారు....

"ఇది గమనించిన సంఘంవారు కుట్రలుపన్ని మారణాయుధాలతో

మరో మారు దాడికి సిద్ధపడుతున్నారు.... కాని ప్రమాదవశాత్తు గొల్ల గంగులు యింట్లో బాంబుపేలి కుట్ర బహిర్గతమైంది.... సోదా చేసిన పోలీసులకు అయిదు బాంబులు దొరికాయి.... చట్ట ప్రకారంగా కల్లోలిత ప్రాంతంలో ఏరకమైన మారణాయిధాలు కలిగి ఉన్నా నేరమే....''

"గరీబోల్లేనా? అందరా?'' కొడుకు అడిగిండు.

''మరైతే మాలచ్చుదొరకు రొండు తుపాకులున్నయి, గాటి మాటేంది?'' గంగులు అడ్డు తగిలాడు....

జడ్జీ ముఖం చిట్లించి "ఆడర్.... ఆడర్'' అని సుత్తి కొట్టాడు.

"సంఘ సభ్యులు కొందరు నాటుబాంబులేకాదు, తుపాకులుకూడా ధరించి రాత్రి గ్రామాలలో బీభత్సం సృష్టిస్తూ, పగలు కొండల్లో ఉంటున్నట్లు ఇటీవలి వార్తలు తెలుపుతున్నాయి.... ఇట్లాగా మారణాయుధాలు ధరించిన సంఘసభ్యులు అమాయక ప్రజలను, దొరలను బెదిరించి గ్రామాలలో భయాందోళనలు సృష్టిస్తున్నారు. ఇట్లాంటి వాటిని, సాధారణ ప్రజా జీవితానికి భంగం గలిగే విద్రోహ చర్యలను సకాలంలో అరికట్టకుంటే- లక్ష్మణరావు గారి లాంటి వారికే కాక ప్రజలకు మాన. ధన, ప్రాణహాని జరిగే ప్రమాదమున్నది. ఇలాంటి సంఘ విద్రోహచర్యలు ఒక్క గ్రామానికే పరిమితం కాక ముందు ముందు దేశ భద్రతకు కూడా ముప్పు తెచ్చిపెట్టగలవని ఆనరబుల్ జడ్జీగారికి మనవి చేస్తూ- ఇలాంటిచర్యలను అరికట్టడానికి ముద్దాయిలిద్దరినీ ఉచితరీతిలో శిక్షించగలరని కోరుతున్నాను'' పబ్లిక్ ప్రాసిక్యూటర్, లేదా ఎత్తుపళ్ళలాయరు కంఠపాఠంగా అప్పగించి కూర్చున్నాడు.

తర్వాత మరో పది నిముషాలు యస్. ఐ. గారిని ఇద్దరు

పోలీసులను, మరొక సాక్షి అనబడే లక్ష్మణరావు తొత్తును ప్రశ్నించడం జరిగింది. గంగులు ఒప్పుకున్న విషయాలే వాళ్ళు చెప్పారు.... గుమస్తా రాసిందే మళ్ళీ రాశాడు....

అంతదాకా గొల్ల గంగులు ఆందోళన పడుతున్నట్టుగాని, భయ పడుతున్నట్టుగాని కనిపించలేదు, అందరి మాటలయిపోయిన తరువాత కొడుకు ముఖం చూశాడు.... అది అప్పటికే ఎరుపెక్కింది.... పొదిల గొర్రె పిల్లలాగా బోనులో చిరాకు పడుతున్నాడు.

"మున్సోసాబ్ దొర- తమరి ముంగట నేనోటొండు ముచ్చెట్లు సెప్పాల్ననుకుంటున్న'' అన్నాడు గంగులు....

జడ్జీ యాంత్రికంగా జీవంలేనినవ్వు కనిపించీకనిపించకుండా నవ్వి తలూపాడు.

"నేను తమరి ముంగట గిప్పుడే కొత్తగా నిలుసుండలేదు.... రెండేండ్ల బట్టి ఆకులు జాడిచ్చిన అడవిల మేకలు దిరిగినట్టు కచ్చీర్ల పొంట దిర్గుతనేఉన్నం.... మంచో సెడ్డో తమరినేటియిని సేసేటియి సేత్తండ్రు ...మిమ్ముల్ననేదే ముండదని నాకు తెలువక్కాదు. తమరు కూకున్న కుర్సిమీన ఎవలుగూకున్న గంతే సేత్తరని మాకెప్పుడో ఎరికయ్యింది.... నా మట్టుకు నాకు''

"తమరు సుత మంచే సేత్తరని అప్పుడప్పుడు ఆశగలుగుతది.'' కొడుకు వెక్కిరింపుగా అన్నాడు....

"ససరాదుర.... సను.... ఎవారం కట్టెకొట్టె తెచ్చెనన్పట్టుంచె గింత పీకులాటెందుకు?'' అని కొడుక్కు చెప్పి కొంచెం ముందుకు వంగిండు....

కొడుక్కు ఎప్పటినుంచో గజెకర్ణి దురద పెడుతోంది. మనుస్సంతా

చిరాకు గున్నది .... గోకాలంంటె వంగాలె .... గోకాలో లేదో తేల్చు కోకుండా ఉన్నాడు.

"నిచ్చమే.... మేం బాంబులు పట్టుకున్నం- బందూకులు సుత పట్టేయేల్లత్తదేమొ ఎవలు సెప్పచ్చిండ్లు .... ఒక సెయ్యి తోని సప్పల్లేగయి. రొండు సేతులుండాలె ... మైదానంల కొట్లాటకు దిగినంక ఎదుటోడు కత్తి తిప్పుతంటె ఉత్త సేతులగొట్లాడినోడు కత్తిపోట్లు దింటడు.... ఎదుటోడు కత్తిబట్టుడు ఖానూనైతె- ఇంకొకడు సుత కత్తి బట్టటం దాని ముత్తాత ఖానూను. కనిఖానూను కత్తిబట్టి నోనికి మెడియ్య మని సెప్పిందని తిల్లేపి మల్లేసి అకేలు సెప్పుకచ్చి పెద్ద పెద్ద మాటలతోని మేం దొంగలమో లంగలమో మరేదో అని సెప్పుకచ్చిండు.... అదట్ల ఉండనియ్యిండ్లి

"నా పక్కన నిలుసున్న నాకొడుకు కంతల్ల బర్రలు సూసిండ్లా?

జడ్జీ, వకీలు, అమీన్ అంతా చిత్రంగా చూశారు...

"మూడేండ్లల్లనో, నాలుగేండ్లల్లనో ఈనికి కిరిమచ్చి పిడికిల్లు, పండ్లు బిగబట్టిండు....సూపినోల్లంత పోరడు దక్కడంటె దక్కడన్నరు బిచ్చగాళ్ళ రాయలింగుబావచ్చి పసుపు గొమ్ము కాలబెట్టి సుర్రుసుర్రున గాలంగ కణతల్లఒత్తిండు....తమరి లాంటి పెద్ద లోకులు మందో మాకో సూదో, గోలో ఏసుకొని దక్కిచ్చు కోవచ్చు- మోటుగాళ్ళం- నానెత్తురే నాకొడుకే.... కాని కంతల్ల కాల్వకుంటె బతికె టోడుగాదు ఆయేల్లన పసుపు కొమ్మే అతారయ్యింది. నేను గొల్లోన్ని.... గొర్లగాసుక బతికె టోన్ని.... నాకు తెలుసున్న మరొక్క ముచ్చట సెప్పుత.... పదిదినాల కింద మాట— మా మంద మీదికి తోడేలు అలవాటయ్యింది.... కండ్లల్ల అత్తులేసుకొని మందసుట్టు ఎన్నిపారీలు తిరిగినా ఏనాత్రో గుట్టుసప్పుడు గాకుంటచ్చి మందమీన బడేది.... మాంచి పసక పిల్లను ఈడ్చుక

పొయ్యేది.... సెట్టో, పుట్టో ఒర్రో గిర్రో సాటుకు ఇంకోటుండేది. రెండు గలిసి గొర్రె పిల్లను రెండుగ సీరుకొని ఎత్తుక పోయేటియి గొల్లోల్లమంత మొఖాన కొంగుబెట్టుకొని ఏడిత్తేమున్నది అరుత్తేమున్నది? మేం ఎంత మందిముంటేంది? సేతుల్ల గుతుపలుంటేంది? అఖరు కేమయ్యిందంటె- మాదాంట్ల కత్తెర సాలడో ఉపాయం జెప్పిండు.... గొర్రె పేగుల్ల తూట బెట్టి అదచ్చె తొవ్వల బెట్టినం.. దానేల్లకు అదిరానే అచ్చింది, దొంగ బుద్ది ముండ పేగులు మురికి సూసింది.... నోటబట్టుకొని ఒర్రెలకు బొయి తిందా మనుకున్నది. తూట బేలింది. ఎగిరిసచ్చింది. మందకు తోడేలు పీడ బాసింది

"ఆఖరు ముచ్చెట. తమరికి తెలిసే ఉంటది. కౌరవులచ్చి ఇరాట్రాజు ఆవుల గొట్టుకపోయిండ్లు- అందరు పిసపిసలాడిండ్లు- ఇజ్జానికి బోవాల్నంటె కౌరవులకున్న బానాలు ఇరాటరాజుకు లెవ్వు. మరందుసేత ఆటపంతు లేషంలున్న అర్జెనుడు జంబిసెట్టు మీదున్న బానాలు తియ్యక తప్పలే- లడాయి జెయ్యకతప్పలేదు. ఆవుల మలిపినోడె అర్జెనుడు.

"మావూళ్ళ సంగతి.... ఇవ్వాల్దన్క మావూల్లె ఏమేమి జర్గి పోయినయొ దొరల పచ్చాన చెప్పుకచ్చిండ్లు....

"మేమెందుకు సంగం బెట్టుకున్నం? మావూల్లె లచ్చయ్యదొర అయినె బంట్లు గలిసి ఇల్లిల్లు దోసిండ్లు- ఎట్లాగా? కిందికుండ కిందుండ గనే మీదికుండ మీదుండంగనే నడిం కుండ తప్పదీసినట్లు- కుంచెడు మంచెడు- పది అయిదు అప్పులిచ్చి- పెచ్చులు అడ్డీలు కట్టీకట్టి మా కురిబెట్టి మా ఎకురా అరెకురం బూములు నాకేసిండ్లు.... మీదికెల్లి ఎట్టిపిల్లల పేర, దండుగుల పేర మేంపెంచిన కోళ్ళు గొర్లు గొడ్లు అన్ని గుంజుకున్నరు గియ్యన్నేంది- మా ఒంట్లె గోరెడు మాంసం లేకుంట

ఒళుసుకున్నరు. సిమ్మోడు నెత్తురు లేకుంట పీల్చుకున్నరు. బరాంచినంత కాలం బరాంచినం. ఏటోక్కని కొంప గూలుతంటె- ఏటొక్కని సంసారం గోదాల్లె గలుత్తాంటె మేము పెసుగు లాడలేదనిగాదు....అడు సొట్ల తవుడు బోసి కుక్కల తాకులాట బెట్టిచ్చినట్టు ఎత్తుమీదెత్తు లేసి నడుపుకచ్చిండు.''

"పెండ్లిల్ల సొప్పమంతుటం సవివినట్టు ఏందీ గులుగుడు.''
కొడుక్కు తిక్క తిక్కగా ఉన్నది....

"గిది గులుగుడు గాదుర.... కడుపులసొద.... ఇన్నేండ్ల బట్టి కడుపుల గడ్డ తీర్గ పెరక్కచ్చిన సొద....'' మళ్ళీ జడ్జివేపుతిరిగి....

"నిచ్చమే, మావోడన్నట్టు తప్పుకుంటె పెంకలు తప్ప బాగ్గెంరాదు.... ఇదివరకు గిదిగిట్లని మాట్లాడెరుగం.... గట్లల్లగట్టోలె సెట్లల్ల సెట్టోలె- మందల గొర్రెతీర్గ బతికినోన్నే.... సంగమచ్చినంక నే నేను నలుగుట్ల మాట్లడిన మనిషి తీర్గ....లచ్చుపారీల జెప్పిన ఈసొదతీరంది.... నాకండ్ల ముంగట ఒర్రంగ నామేకల మెడలు గోసుక తిన్నరు.... కార్జపుసొంటి పెరడి అని కొమ్ముర్నే పెట్టుకున్నడు సరె! గదంత గంగల బోనియ్యుండ్లి. నేనెందుకు బాంబు దగ్గెర బెట్టు కున్ననో గదిసుత సెప్పుత....

"మొట్టమొదట్ల అందరం కుప్పగూడినంక గాంథోనైరో సెప్పి నట్టుగనే సేతులు ముంగట బెట్టుకొనే మాకు కయికిల్లు బెరుగాలని, ఎట్టి బందు గావాల్నని మొత్తుకున్నం.... దొరగప్పుడేం మాట్లాడలేదు.... గని దిన మొకనింటికి సుంక రోన్ని దోలిచ్చిపాత బాకీలన్ని కక్కి తీరాలన్నడు.... మా పెండ్లాలను పొల్లగండ్లను అమ్మినా తీరనంత బాకీలు తేలదీసిండు.... దొంగ పద్దులు మేం గట్టమన్నం.... అప్పటికే ఆరందినాల నుంచి ఉపాసముప్పడి ఉంటన్నం.... లొల్లిముదిరి పోయింది

దొర అప్పుల సంగతి ఎత్తకుంటనే కాపు రంగయ్యను ఈదుల్లదొరి కిచ్చుకొని తనిచ్చిండు. అట్ల ఊకున్నం. మరొకన్నితాళ్ళల్ల.... అఖరుకు మా పోశాలును అద్దమనాతిరి పురుసాలు పిసికి సంపిచ్చిండు గిదేందని అడుగ బోయినందుకే.... గడితలుపులు మూపిచ్చి- అదోల్లు పోల్ల గండ్లని సూడకుంట గుండగాళ్ళతోని నెత్తుర్లు గారంగ కొట్టిచ్చి- తనే ఉల్టా మామీన కేసు బెట్టిండు....

"గిట్ల తమరి ముంగటి కచ్చిన అన్నికేసులు జర్గినయ్ .... మేం దుక్కమో కోపమో ఆగబట్టగ అందరం తిట్టుకుంటనో మొత్తుకుంటనో ఆనిముంగటికి బోవటం ఆడు పకడ్బందీగా మామీన ఇరుసక పడటం- అందరం తన్నులు దెబ్బలు దినటం జరిగేది.... మల్లమీది నుంచి కేసులు...."

"గిట్ల దగ్గుతె కేసు- నోరు తెరిత్తె కేసు- మూత్తె కేసు....మందకు మందను తానకు దోలిచ్చెటోడు ... బేల్లు, కేసులు, ఆకీల్లు-మాబతుకంత కుక్కలు సింపిన ఇత్తారయిపోయింది.... పంటలు గంగలగల్సినయ్.

గిన్ని సేసిన సుత ఆని పనులు నడువలేదు.... ఆనింట్లాదే మురిగి సచ్చేకాల మచ్చింది.... మీదికెల్లి పిరికిజొచ్చింది. దస్కంబట్టుకొని ఏడాది కింద ఊళ్లె నుంచి ఎల్లిపోయిండు. పీడ బాసిందనుకున్నం ఆడుబోయిన పోలీసోల్ల పీడదప్పలే....

"పోయినోడు ఎవల భరువస దొరికిందో ఏడాదికి పోలీసోల్ల ఎంటబెట్టు కచ్చిండు.... పోలీసోల్ల తోలు బూట్ల టకటకలాడిచ్చుకుంట ఏదుంటె అది పట్టుక పోవుడు. కల్లు సారలు దాగి ఇండ్లల్ల సొచ్చుడు. మాట్లాడితె నచ్చలేటని తన్నుడు కేసులు బెట్టుడు షురువు జేసిండ్లు.

"గిందట్ల రొండు సంగతులున్నయ్. ఒకటేమొ-మేం కోపమచ్చిన దుక్కమచ్చినా పసురాలసొంటోల్లం గన్క దానికోరీతి లేకుంట ఎల్ల

బోసుకున్నం. దొరేమొ పకడ్బందిగా ఇసారం జేసి మామీద ఎదురుదెబ్బ దీయ బట్టిండు.... మేం తిట్లల్లున్నప్పుడు దొర దుడ్లు బట్టిండు, ఏడుపులు బనికిరావని మేం దుడ్లు బట్టడం మేం దొరగుండగాళ్ళ నుంచి నేర్చుకున్నం— దొర కత్తులు కటారులు దీపి దొంగ దెబ్బదీసిండు. మేం కత్తులు బట్టినం- దొర తుపాకుల పోలీసుల దెచ్చిండు.... మరింక మేం ఎదురు జవాబియ్యకుంటే బతుకలేమని బాంబులు బట్టినం.

"ఎర్రి గొల్లోని కెన్ని దమ్ములని తమరు కోప్పడవచ్చు. కని ఊళ్ళె తుపాకు లేసుకొని పోలీసోల్లు లేకుంటే మేం ఇన్ని పుల్లెందులు బడకనే పోదుము...."

"ఊళ్లె ఉన్న ఒక లంగ, దొంగ, మంది కొంపలు ముంచెటోడు మంది నెత్తురు తాగెటోడు ఒక్కడు.... మళ్ళింక ఆళ్ళ వచ్చాన్నె తుపాకులేసుకొని గుండగాళ్ళ, పోలీసోల్లచ్చి మా యిండ్లు సత్తె నాశిడం జేత్తె తప్పుగాదు. మరింక దిక్కులేక, మా ఆడోల్లకు, మాకు యేఏల్లల ముప్పత్తదో తెల్వక మా బొడ్లె సిన్న కత్తి బెట్టుకుంటె- సిన్న బాంబు బెట్టుకుంటె- తప్పెట్లయితది నాకు సమఝయితలేదు.

"మేం పనులుజేసుక బతికేటోల్లం. మేం బాంబులు గోదాల్లె పారెత్తం, మా దగ్గర గుంజుకున్న భూములు, పసురాలు మా కియ్యమనుండ్లి.... మాట్లాడ్తినే తన్నులు గుద్దులనోదెట్లిత్తడు. మరందుచేత మేం లడాయి సెయ్యక తప్పదు. ఎదుటోడు అన్నెయంగ తుపాకులు పట్టుకుంటె మేం నాయం కోసం బాంబులు పట్టినమ్. మీరెంత మొత్తుకున్న. మీ కితాబులేంత మొత్తుకున్న, మీ పోలీసులు ఎన్ని ఎత్తులేసిన- మీ అకీల్లు ఎన్ని కీల్లమాటలు మాట్లాడిన మీ గాంధీ నైరు సర్గంల బాదపడిపోయిన గిది తప్పదంటె తప్పదు. కిర్మి రోగమత్తె సంత కొడుకైన కంతలు గాల్సినట్టే- తోడేలు పీడ బోవన్నంటె తోట

బెట్టక తప్పనట్టే- ఆవుల మలుపాలంటె అర్జెనుడు బానం పట్టక తప్పదు....'' గొల్ల గంగులు గుంటల మొఖంలో ఉద్వేగం....కంఠంలో తీవ్రత....

ఎత్తు పళ్ళ వకీలు ముఖం మాడిపోయింది. యస్. ఐ. పండ్లు గొరుకుతూ "నక్సలైటు నా కొడుకును....'' గొణుక్కున్నాడు జడ్జీ అసహనంగా కదిలి అసహ్యంగా ముఖం పెట్టి అదే దెబ్బ.... "ఆడర్.... ఆడర్....'' అదే గొంతు. గుమస్తా చేతిలోని పెన్ను బెల్లంరంగు కాయితం మీద దిగబడి పోయింది.

గంగులు అందరి ముఖాలు చూసి ఎలుగు రాసిన గొంతుతో, "గొల్ల లంజకొడుక్కు ఎన్ని గుండెలని మీరంతా అనుకుంటారు. మీకు సందు దొరుకుతె దొడ్లె దోల్తరని నాకెరికె.... నాకేం ఫికరులేదు నేను ఊఁ అన్నా ఉప్పురాయన్న దొడ్లె దోలటానికి నూటొక్క భానూన్లు నిండ మునిగినం సలిబెడ్తందని కూకుంటె ఫాయిదాలేదు.... మేం ఎప్పుడో సర్వనాశిడమై పోయినం మరింక అయ్యేదేమిలేదు....

"మున్సోసాబ్ దొరా! నా మీన దీనితోని ఆరు కేసులున్నాయి. మావోని మీన ఏడో ఎనిమదో ఉన్నయి ఇంకా కొత్తయి రావనే నమ్మకలేదు. దొరలు తల్సుకుంటె దెబ్బలకేంకొదువ. సేతుల తుపాకి బెట్టి, తుపాకితోటట్టుక పట్టుకున్నమంటరు.... కాదు పోదంటె నడూల్లె తుపాకి నేసి సంపి గుట్టల్ల ఎదురు కాల్పుల్ల సచ్చిండంటరు.... ఇప్పటికే కేసులకు, జమానతులకు, అకీల్లకు పెట్టి పెట్టి యాష్ట కచ్చినం.... ఏది జేసిన, ఏదన్న మీ సేతకు నోటికి ఉదరు లేదు- మీరాజ్జెంగన్క.

''మరింక నేను గీ కేసుల సుట్టు పుచ్చిన కుక్క తీర్గ తిరుగలేను. నా వొంట్లె జిగసచ్చింది.... మీరు మాట్లాడే మాటలు బడలేను. నేను

లంగనుకాదు. దొంగనుకాదు- గొల్లోన్ని.... ఎర్ర గొల్లోన్ని ఆఖరుకు ...'' గంగులు కంఠం పూడుకపోయింది.

జడ్జీ కుర్చీమీది నుంచి లేస్తూ కేసు వా యి దా పడ్డట్టుగా ప్రకటించాడు.

''నేను కేసుల సుట్టు దిరుగలేను- మీ కానూన్లు, కచ్చీర్లు, మీ పోలీసులు, ఆళ్ళ తుపాకులు.... తన్నులు గుద్దులు- తప్పిచ్చుకోకుంటె బతుకలేను మాకు అన్ని నేర్పింది మీరే.... మీ దుట్టితనమే.... ఆఖరుకు బడాయి సుత మీరే నేర్పుతండ్లు.... గంగులు గొనుగుతున్నాడు.

కొడుకు గంగులు ఎడం రెక్క బట్టుకొని బయటకు సుకొచ్చాడు....''

కోర్టు ఘుందు జనం ఆ తండ్రీ కొడుకులను వింతగా చూస్తుండగా గొల్ల గంగులు వెనుకకు తిరిగి కా ం డ్ర కి చ్చి మ్మేసిండు....